
# నాటకం ఆగిపోయింది

వేములకొండ రమణ

(నాటిక)



పాత్రలు:

పద్మ (శాంత) : కిరాయి నటీమణి, వయస్సు 20 సంవత్సరాలు.

ఆనంద్ (మూర్తి) : అందగాడు, నాటక దర్శకుడు. వయస్సు 25 సంవత్సరాలు.

రంగారావ్ (రంగనాథం) : మధ్య వయస్కుడు. నటుడు.

రాజా (శేఖరం ) : మంచి విగ్రహం. వయస్సు 30 సంవత్సరాలు. నటుడు.

చలపతి (రామయ్య) : ఛాందసుడు. వయస్సు 50 సంవత్సరాలు. నటుడు.

రంగశ్రీ : నాటక కర్త. చలపతి వయస్సే.

ఇన్‌స్పెక్టర్ : చురుకైన పోలీసు ఆఫీసర్. మధ్య వయస్కుడు.

(బ్రాకెట్లలోని పేర్లు నాటకంలోని పాత్రల పేర్లు. ఇన్‌స్పెక్టర్ తప్ప మిగిలిన వారందరూ కళాకుంజ్ సాంస్కృతిక సంఘ సభ్యులే).

ప్రదేశం : ఆంధ్రప్రదేశ్ రాజధాని. రంగస్థలం : ధనికుని ఇంటి డ్రాయింగ్‌రూమ్.

సమయం : సాయంత్రం ఆరున్నర, ఏడున్నర మధ్యకాలం.

(రంగస్థలం ఒక ధనికుని ఇంట్లోని డ్రాయింగ్ రూమును సూచిస్తూ ంటుంది. రంగస్థలానికి కుడివైపు ఇంట్లోకి వెళ్ళే ద్వారం, ఎడమవైపుగా వీథిలోకి పోయే ద్వారం ఉంటాయి. గది వెనుక గోడకు-అంటే సోఫా సెట్ వెనుక గోడకు-ఒక ఫ్రెంచ్ విండో ఉంటుంది. ద్వారాలకు, కిటికీకి తెరలు వ్రేలాడకట్టి ఉంటాయి. గది మధ్యగా ఒక సోఫా సెట్, టీపాయ్ ఉంటాయి. దానికి కుడివైపుగా ఒక రాకింగ్ ఛైర్ ఉంటుంది. ఇంటి ద్వారానికి, ఫ్రెంచ్ విండోకు మధ్య గోడవారగా ఒక డ్రింక్స్ కాబినెట్-దాని కెదురుగా వీథి వైపు గోడ కానుకొని ఒక బుక్ షెల్ఫ్ ఉంటాయి. ఫ్రెంచ్ విండో క్రిందుగా ఒక రైటింగ్ టేబిల్, కుర్చీ ఉంటాయి. గోడలకు పెద్ద పెద్ద పెయింటింగ్స్ అందంగా అమర్చి ఉంటాయి.

తెర తొలగేటప్పటికి శాంత సోఫాలో కూర్చొని, 'ప్రభ' వార పత్రిక తిరగేస్తుంటుంది. రంగనాథం రాకింగ్ ఛైర్‌లో కూర్చొని 'టైమ్' మాగజైన్ చూస్తుంటాడు. ఫ్రెంచ్ విండో వద్ద నిలబడి కిటికీలోంచి చూస్తుంటాడు మూర్తి.)

రంగనాథం: నువ్వేన్నా చెప్పు, మూర్తీ! హత్యకు ముందు సుశీలను చూసిన ఆఖరి వ్యక్తి శేఖరమే.'

మూర్తి: అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు, మామయ్యా? (బుక్ షెల్ఫ్ వైపు రెండడుగులు వేస్తూ) ఏడు, ఏడున్నర మధ్య సుశీల హత్య చేయబడిందని కదా పోస్టుమార్టమ్ రిపోర్టు. శేఖరం వెళ్ళిన గంటకి తన్ని పిలిచి "తలనొప్పిగా ఉంది- కాఫీ పట్రా" అన్నా రమ్మగారు అని కదా వంట మనిషి మంగమ్మ చెప్పింది. (వెనుదిరిగి) మరి దాని కేమంటావు, మామయ్యా?

శాంత: (చేతిలోని వారపత్రిక టీపాయ్ మీద పడేస్తూ) మరి శేఖరమే హంతకుడని ఎలా అంటావు, బాబాయ్?

రంగనాథం: డబ్బు చేయించలేనిది ఏముందమ్మా ఈ కాలంలో? మంగమ్మకు డబ్బాశ చూపి ఉంటాడు శేఖరం. అందుకే తప్పుడు సాక్ష్యం చెబుతోంది మంగమ్మ.

మూర్తి: (సోఫాల వైపు అడుగు వేస్తూ) ఈ తర్జన భర్జనలకేంగాని, మామయ్యా, మనం చేయాల్సింది ఆలోచించు. సుశీల చాలా ఉత్తమురాలు, త్యాగశీలి... పైగా నీకు పరాయిదేం కాదు. ఆమెను హత్య చేసిన వాణ్ణి పట్టుకోవడానికి శాయశక్తులా పోలీసు వారికి సాయపడాలి మనం...వంద మంది దోషులు పట్టుబడక పోయినా పోయింది లేదు గాని, ఒక్క నిర్దోషి శిక్షింపబడితే అది క్షమింపరాని అన్యాయం. అటువంటి ఘోరం జరక్కుండా చూడటం మన కర్తవ్యం.

(క్షణం నిశ్శబ్దం...ఎక్కడో ఏదో శ్రుతి తప్పిన సూచన.)

మూర్తి: (ఏం చెయ్యాలో తెలీనట్టు నిలబడిపోయాడు క్షణం. ఒకటికి రెండుసార్లు వీథి ద్వారం వైపు చూశాడు ఆత్రతతో, నిరాశ, నిస్పృహలతో రంగనాథాన్ని, శాంతను చూశాడు. రిస్టువాచీ చూసుకొని) ఏడు దాటింది- ఇంకా రాలేదు శేఖరం (అన్నాడు అన్యాపదేశంగా).

రంగనాథం: (కంగారు కప్పిపుచ్చుకుంటూ) శేఖరం అన లెన్నింటికి వస్తానన్నాడు?

(నేపథ్యంలో ఏదో హడావుడి, గందరగోళం. "రాజా ఏడీ?" "రాజా ఏడీ?" అంటూ తెరవెనుక ఎవరో వరుగెత్తిన అలజడి).

మూర్తి: ఆరింటికల్లా వస్తా నన్నాడు. ఇంకా ఎందుకు రాలేదో మరి!

శాంత: (ఏం చెయ్యాలో తోచక, మళ్ళీ ఏదో పత్రిక తీసి, గబగబా పేజీలు తిరగవేయసాగింది నెర్వస్‌గా).


మూర్తి: (చిరాకుతో నాలుగు అడుగుల్లో డ్రింక్స్ కాబినెట్ చేరుకున్నాడు. అనాలోచితంగా విస్కీ బాటిల్‌పై చేయి వేశాడు. రంగనాథం వైపు చూస్తూ) లైక్ టు హేవ్ ఎ డ్రాప్ ఆఫ్ విస్కీ?

రంగనాథం: (అనుకోని ఈ మలుపుకు తడబడుతూ) నో... థాంక్స్...

మూర్తి: (జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి రంగనాథం వద్దకు వెళ్ళి) అట్‌లీస్ట్, ఎ స్మోక్?

రంగనాథం: (తీసుకుంటూ) థాంక్స్.

మూర్తి: (తనూ ఓ సిగరెట్ నోట్లో ఉంచుకొని, లైటర్‌తో రంగనాథం సిగరెట్ వెలిగించి, తనూ వెలిగించుకున్నాడు. మళ్ళీ మెల్లమెల్లగా డ్రింక్స్ కాబినెట్ వైపు అడుగువేసి, ఓ గ్లాసులోకి విస్కీ వంపుకున్నాడు. మెల్లగా విస్కీ నీట్‌గా సిప్‌చేస్తూ, ఫ్రెంచ్ విండో వైపు




వెళ్ళాడు. కిటికిలోంచి దూరంగా చూస్తూ) నిశ్శబ్దమైన ఈ వాతావరణం భయంకరంగా లేదూ? దీన్నే కాబోలు కామ్ బిఫోర్ ది స్టార్మ్ అంటారు. (వెనుదిరిగి, సోఫాల వైపు అడుగువేస్తూ) చూస్తుంటే, శాంతా! ఏదో గొప్ప అనర్థం జరిగేట్టు లేదూ?

రంగనాథం: నే చెప్పలేదా, మూర్తీ, శేఖరం నమ్మదగ్గ వ్యక్తి కాడని. నా మాట కాదని, వాణ్ణి రక్షించాలని తాపత్రయపడుతున్నావు. ఇప్పుడు చూశావుగా...కనీసం వస్తానన్న సమయానికి ఊడిపడ్డాడా? లేదు. అన్న మాట నిలబెట్టుకోవడం వాడి డిక్షనరీలో లేదు. (అంటూ మూర్తి వైపు చూశాడు. నిశ్చేష్టుడయ్యాడు.)

శాంత: (మామూలుగా మూర్తి వైపు చూస్తున్నదల్లా అతనిలో వస్తున్న మార్పులకు భయాందోళనలతో లేచి నుంచుంది.)

మూర్తి: (ఎడం చేత్తో గొంతు రాసుకుంటూ, మూలుగుతున్నాడు. కుడి చేతిలోని గ్లాసు ఈ బాధలో జారి నేలమీద పడి పగిలిపోయింది. ఏదో ఆసరా కన్నట్లు కుడి చెయ్యి సోఫా బాక్ రెస్టుపై వేసి ఆనుకోబోయాడు. సోఫా తిరగబడింది అతని బరువుకు. దానితోబాటు తనూ పడిపోయాడు-'ఆ' అని పెద్దగా అరుస్తూ).



శాంత: (భయంతో ఓ పిచ్చికేక పెట్టి, కంగారుగా పరుగుపెట్టింది ద్వారంలోకి.)

రంగనాథం: (సంభ్రమాశ్చర్యాల్లోంచి ఎలాగో తేరుకొని, మూర్తి ప్రక్కకెళ్ళి గుండె తడిమి చూశాడు. నాడి పట్టుకుని చూశాడు. వెంటనే ఒక్క పరుగున ఫ్రెంచ్ విండో దగ్గరి కెళ్ళి పెద్దగా అరిచాడు.) చలపతీ!...చలపతీ! కర్టెన్...కర్టెన్ దింపమను...ఎ స...వెంటనే...క్విక్...ఎవరైనా డాక్టర్ని పిలవండి త్వరగా...

(రంగనాథం అరుపులు ఇంకా పూర్తి కాకుండానే, తెర మెల్లగా దిగింది కొంచెం. క్షణం ఆగి, ఒక్కసారిగా గబగబా క్రిందకు జారింది. వెంటనే ఆడిటోరియం లైట్లు వెలిగాయి.

ప్రేక్షకులలో కలకలం, కేకలు, ఈలలు, గందరగోళం.

మూడవ వరసలో కూర్చున్న ఒక వ్యక్తి లేచి ప్రేక్షకుల నుద్దేశించి-"ప్రేక్షక మహాశయులారా! దయచేసి గోల చేయకండి. నాటకం జరుగుతుంటే, ఒక ఆర్టిస్టుకు ఏదో అయి పడిపోయినట్టుంది. మీరు గోల చేయకండి. నాటకం అయిపోలేదు. నేను సంగతేమిటో కనుక్కొని వస్తాను...దయచేసి మీరంతా నిశ్శబ్దంగా, ఓపికతో కూర్చోండి పది నిముషాలు...నే వెళ్ళి చూసి వస్తాను" అంటూ స్టేజి ద్వారం గుండా లోనికి వెళ్ళాడు. స్టేజి మీద హడావిడి ఇంకా తగ్గలేదు. ఆడిటోరియంలో ఉండి ఉండి ఈలలు, కేకలు.

కొద్ది క్షణాల తర్వాత తెర మెల్లగా లేస్తుంది.

ఇప్పుడు రంగస్థలం మీద పద్మ (శాంత), రంగారావు (రంగనాథం) కాక చలపతి (రామయ్య) కూడా ఉంటారు. పద్మ ఒక సోఫాలోనూ, కాళ్ళు పైన పెట్టుకొని చలపతి మరో సోఫాలోను కూర్చొని ఉండగా, రంగారావు పద్మ కూర్చొన్న సోఫా వెనుకగా నిలబడి ఉంటాడు.

పద్మ ఏడుస్తుంటుంది. రంగారావు, చలపతి ఆమెను ఓదారుస్తుంటారు.)

చలపతి: కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందంటారు కదయ్యా దీన్నే!...ఎడమ కన్ను ప్రొద్దుట్నుంచీ అదురుతుంటే, ఇవాళ చెడు తప్పదనుకున్నాగాని, ఇంత ఘోరం...అవ్వ...ఆనంద్ ఇలా బాల్చీ తన్నేస్తాడని, ఈ 'నాటకం ఆగిపోయింది' నాటకం నిజంగానే ఆగిపోతుందని అనుకోలేదు కదయ్యా!

రంగారావు: (చిరాగ్గా) నీ సుత్తి కాస్త ఆపుతావా, చలపతీ!

పద్మ: (ఇంకా ఏడుస్తూనే) నమ్మలేకపోతున్నాను ఆనంద్ పోయాడంటే. ఇంకా నాటకం డైరెక్టు చేస్తున్నట్టూ, మూవ్‌మెంట్స్ చెబుతున్నట్టూ, మాడ్యులేషన్ కరెక్ట్ చేస్తున్నట్టూ-నా కళ్ళకు కడుతున్నాడు ఆనంద్.

రంగారావు: మకుమాత్రం!...ఓ మహా నటుడు, ఓ ప్రఖ్యాత ప్రయోక్త రంగస్థలం మీద నటిస్తూ, నటిస్తూ మన కళ్ళ ముందే అస్తమించడం-అంతా ఓ కలలా ఉంది.

చలపతి: ఇన్నేళ్ళుగా నాటకాలు ఆడిస్తున్నాను కానండయ్యా! ఎవరూ ఇలా స్టేజీమీదే చావడంగాని, ఇటువంటి అవాంతరాలు రావడం గాని ఎరగనుకదయ్యా. ఇప్పుడింక శవపంచాయతీ కదయ్యా! పొద్దున్నే దహనకాండ కదయ్యా! అన్నీ ఖర్చులే కదయ్యా!

పద్మ: ఆనంద్ పోయాడని మేం చాలా బాధ పడుతుంటే మధ్య మీ గొడవేమిటండీ?

చలపతి: ఆడదానివి కదమ్మా... బాధపడవూ మరి? (రంగారావు వైపు తిరిగి) మోసేవాడికి తెలుస్తుంది కదయ్యా బరువు. ఇప్పుడు (ఏడ్పు మొహంతో) నెల్లాళ్ళ రిహార్సల్ ఖర్చు, నటీమణిగారి కిరాయి ఖర్చు, మళ్ళీ ఆవిడగారి రానూ పోనూ ఆటోఖర్చులు, ఈ రవీంద్ర భారతి బుక్ చేసుకున్న ఖర్చులు-వీళ్ళు గీపెట్టి చచ్చినా రివండు ఇవ్వరు కదయ్యా ఆ పైన... ఆ... పై...న (అంటూ ప్రేక్షకుల వైపు చూశాడు) అయ్య బాబోయ్! (పెద్దగానే అరిచాడు, పిచ్చి చూపులు చూస్తూ).

పద్మ: (బెదురుతూ చలపతిని చూస్తుంది).

రంగారావు: (కంగారు పడుతూ) ఏమైంది, చలపతీ? ఎందు కలా అరిచావు?

చలపతి: (ఇంకా పిచ్చి చూపులు పోలేదు)-ప్రే...క్ష...కు...లు. ఆడియన్స్. (ఏడ్పు స్వరంతో) వీళ్ళందరూ ఇప్పుడు డబ్బు వాపసు చేయమంటే నా పని గోవిందా... గోవిందా కదయ్యా (తువ్వాలు నెత్తిన వేసుకుంటాడు).

రంగారావు: అబ్బబ్బ! వెధవ డబ్బు గొడవ కాస్సేపు ఆపు, చలపతీ! (పద్మ వైపు తిరుగుతూ) ఎప్పుడైనా గుండె నొప్పి వచ్చేదని నీతో అన్నాడా ఆనంద్?

పద్మ: లేదండి. తన శరీరం ఉక్కు ముక్క, వజ్రపు తునక అని గొప్పలు చెప్పేవాడు ఎప్పుడూ.

చలపతి: ఏన్నర్థం నుంచి చూస్తున్నాను కదయ్యా-ఎప్పుడు చిర్రున చీదనైనా లేదు కదయ్యా.

పద్మ: ఇంతకూ మన్ని ఇక్కడే ఉండమని, గ్రీన్ రూమ్‌లోకి రావద్దనడానికి ఆయనెవడు?

రంగారావు: ఆయన పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టరట. మన నాటకానికి ఆయన రావడం- ఇట్ ఈజ్ ఎ బ్లెస్సింగ్ ఇన్ డిస్‌గయిజ్.

చలపతి: లెస్స బలికితివి కదయ్యా, రంగారావ్!... ఇకనుండి ఎప్పుడు మనం నాటకం ఆడినా ఓ పోలీసు ఆఫీసర్ని పిలవడం మంచిది కదయ్యా. (అంతలో ఇంటి ద్వారం అవతలివైపు ఏవో మాటలు వినబడుతాయి).

చలపతి: (బాధగా) విన్నావా, రంగారావ్? ఆ గొంతు విలేఖరి సారథిదే... ఇంకేముంది? ఈ ఛావుకు ఏవో చిలవలు, పలవలు అల్లి తాటికాయలంత అక్షరాలతో వేస్తాడు పత్రికలో. ఈ దెబ్బతో రంగారావ్ మన పరువు-ఏది మన కళాకుంజ్ పరువు... అలా అలా ఆకాశాన్నందుకుంటుంది కదయ్యా.

రంగారావు: అందుకే ఈ క్రైమ్ నాటకాలు మన కెందుకయ్యా, చక్కగా 'మా ఇల్లు మాయమయింది' లాంటి ఏ హాస్య నాటకమో వేసుకుందామంటే నా మాట విన్నావా?

చలపతి: (ఉడుకుమోత్తనంతో) ఏ రాయి అయితేనేం, పళ్ళూడకొట్టుకోవడానికి? అసలు 'ఈ నాటకం ఆగిపోయింది' లాంటి క్రైమ్, సస్పెన్స్ ఉన్న నాటకం తెలుగులో ఎక్కడుంది కదయ్యా. ఈ రోజు నిజంగా ఈ నాటకమే జరిగి ఉంటే ఈపాటికి మన ప్రేక్షకులంతా (ఆడియన్స్‌ని

చూపుతూ) ఇలా ఏడుపు ముఖాలతో ఉండే వారటయ్యా. భయభ్రాంతులతో బిక్క చచ్చి కుర్చీల కంటుకు పోయుండేవారు కదయ్యా.

రంగారావు: అవునవును. రచయిత మీ ఆప్తమిత్రుడుగా ఆయనేం రాసినా మీకు బ్రహ్మాండంగానే ఉంటుంది.

(ఇంటి ద్వారం తెరుచుకుంటుంది. ఇందాక ఆడిటోరియంలో ప్రేక్షకులతో మాట్లాడి స్టేజిమీద కొచ్చిన వ్యక్తి ప్రవేశిస్తాడు. అతనే పోలీసు సర్కిల్ ఇన్ స్పెక్టర్).

ఇన్ స్పెక్టర్: (ప్రవేశించి తలుపు వేయబోతూ) నరేనయ్యా, మహానుభావా! మా పరిశోధన ఒక కొలిక్కి వస్తేనే కాని, ప్రెస్‌తో మాట్లాడేది లేదు. సారీ! యు మే హేవ్ టు వెయిట్. (తలుపు వేశాడు)-( స్టేజిమీద ఉన్న వాళ్ళను చూస్తూ) మీ రంతా ఓపిగ్గా ఇక్కడే కూర్చున్నందుకు థాంక్స్.

చలపతి: ఇన్ స్పెక్టరయ్యా! మమ్మల్ని ఇలా నిర్బంధించటం ఏం బావులేదు కదయ్యా.

ఇన్ స్పెక్టర్: (అదోలా చూశాడు చలపతిని).

రంగారావు: (మాట మారుస్తూ) అసలే నాటకం ఆగిపోయిందని, ఆనంద్ పోయాడని మేం బాధ పడుతున్నాం కదండి. అందుకని-

ఇన్ స్పెక్టర్: నా కన్నా ఎక్కువ బాధపడేవారిక్కడ లేరనుకుంటా... ఈ రోజు నాకు ఎలాగో ఆఫ్ దొరికితే, ఏదైనా పిక్చర్ కెళదామని బయలుదేరాను. దారిలో మీ బానర్ చూసి, పోనీ నాటకమే చూద్దామని లోపలికొచ్చాను. కాని ఇలా జరిగింది. ఇప్పుడు నే తెలుసుకోవలసింది తెర వెనుక ఎప్పుడు ఏం జరిగిందో, ఎలా జరిగిందో!

చలపతి: అంతా మీరు చూశారు కదయ్యా! ఇంకేం ఉంది మేం చెప్పడానికి, మీరు వినడానికి?

ఇన్ స్పెక్టర్: తెర తీశాక స్టేజిమీద జరిగింది చూశాను ప్రేక్షకులందరితో బాటు. నిజమే... కాని నాటకం ప్రారంభించడానికి ముందు స్టేజి మీద, స్టేజి వెనుక-అంటే గ్రీన్‌రూమ్‌లో ఏం జరిగిందో అది నేను చూడలేదుగా, అదంతా చెప్పండి. ఆ తరవాత ఇన్ స్పెక్టర్ రెడ్డి వచ్చి మీ వాఙ్మూలాలు తీసుకుంటాడు.

రంగారావు: అదంతా అవసరమా ఇన్ స్పెక్టర్‌గారూ?

ఇన్ స్పెక్టర్: అనవసరమైతే ఎందుకు చేస్తాను?

రంగారావు: అసలే ఆనంద్ పోవడంతో మా మనస్సులు అల్లకల్లోలమయి బాధ పడుతున్నాము. దానికి తోడు మీరు చేస్తున్నదంతా ఎలా ఉందంటే, ఏదో-

ఇన్ స్పెక్టర్: ఆగిపోయారేం? చెప్పండి. ఏదో...?

రంగారావు: ఏదో హత్య జరిగినట్లు, హంతకుణ్ణి పట్టుకోవడానికి చేసే తతంగంలా ఉంది ఇదంతా.

ఇన్ స్పెక్టర్: ఎస్, యు ఆర్ యాబ్‌సల్యూట్లీ రైట్. ఆనంద్ చావలేదు. చంపబడ్డాడు.

(ఒక్కసారిగా భయంకరమైన నిశ్శబ్దం అలుముకుంది నలుమూలలా).

పద్మ: (కష్టంమీద తేరుకుంటూ) హత్యా!... ఆనంద్ హత్య చేయబడ్డాడా? నిజమా ఇన్ స్పెక్టర్‌గారూ?

ఇన్ స్పెక్టర్: సందేహం లేదు. (డ్రింక్స్ కాబినెట్‌వైపు రెండడుగులు వేసి) డాక్టర్ ఖచ్చితంగా చెబుతున్నాడు. పోస్టుమార్టమ్‌లో అదే తేలుతుందంటున్నాడు. (జేబురుమాలుతో విస్కీ సీసా మూత తీసి, వాసన చూసి తిరిగి మూత పెట్టేస్తాడు జాగర్తగా). ఈ సీసాలో పదార్థం మరెవ్వరూ తాగలేదనుకుంటా? అఫ్‌కోర్స్, తాగి ఉంటే ఇక్కడ చాలా శవాలు పడి ఉండేవి.

(ఉన్నట్టుండి వినిపించిన పద్మ ఏడుపుతో అందరి దృష్టి ఆమెపై పడింది).


పద్మ: (ఏడుస్తూనే) అది నా తప్పే, ఇన్ స్పెక్టర్‌గారూ! ఆనంద్ మరణానికి కారకురాల్ని నేనే...కాని ఒక్కటి. తెలిసి నే నా పని చేయలేదు... అసలు అలా జరుగుతుందని నే కల్లోకూడా అనుకోలేదు.

ఇన్ స్పెక్టర్: తెలిసి మీరు ఏంటి చేయలేదు?

పద్మ: నిన్న డ్రెస్ రిహార్సల్లో సీసాలో దాని రంగు విస్కీలా లేదు అన్నాడు ఆనంద్. అందుకని మరి కొంచెం స్ట్రాంగ్‌గా కలిపాను ఇవాళ. కాని ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేకపోయాను. (దుఃఖం ఆపుకోలేకపోతుంది).

ఇన్ స్పెక్టర్: అసలు మీ రేంటి కలిపారు ఈ సీసాలో?

పద్మ: టీ డికాక్షన్ కలిపాను మొదట. రంగు విస్కీలా లేదంటే, కొద్దిగా పెర్మాంగనేట్ వేశాను దాంట్లో.



ఇన్‌స్పెక్టర్: (సూటిగా కళ్ళలోకి చూస్తూ) ఇంకేం కలపలేదా దాంట్లో?
పద్మ: లేదు. పర్మాంగనేట్ కలిపితే విషం అవుతుందని నాకు తెలీదు. ''ఆనంద్ చెప్పాడు-నే కలిపాను. అంతే.
ఇన్‌స్పెక్టర్: మరి ఆనందే ఎందుకు కలపలేదు? మీరే ఎందుకు కలప వలసి వచ్చింది?
చలపతి: చూడు, ఇన్‌స్పెక్టరయ్యా!... మాదో చిన్న ఔత్సాహిక నాటక సమాజం కదయ్యా. ఇక్కడ నౌకర్లు, చాకర్లు ఎవరూ ఉండరు కదయ్యా. ఒక్కొక్క ఆర్టిస్టూ ఒక్కొక్క పని చేసుకుపోవటం మా అలవాటు కదయ్యా. పర్మాంగనేట్ కలిపితే విషమౌతుందని పద్మకు మాత్రం ఏం తెలుసునయ్యా?
ఇన్‌స్పెక్టర్: పర్మాంగనేట్ ఎక్కువగా కలిపినా విషం అవదు. మహా అయితే కొంత కడుపునొప్పి రావచ్చు. కాని ఈ సీసాలో పదిమంది చావడానికి సరిపడే విషముందని డాక్టర్ అంటున్నాడు.
(అందరూ సీసావైపు భయం భయంగా చూశారు).
రంగారావు: అంటే ... ఎవరో...
ఇన్‌స్పెక్టర్: కరెక్ట్! (ఒక్కొక్కరిని తీక్షణంగా చూస్తూ) మీలో ఎవరో ఆనంద్‌ని హత్య చేశారు.
(ఎవరి నోటంటా మాట లేదు. కొద్ది క్షణాలు నిశ్శబ్దం).
రంగారావు: ఇన్‌స్పెక్టర్‌గారూ! పరిస్థితులు ఇలా పరిణమించాయి గనక, మీ కో విషయం చెప్పక తప్పదు.(ఆగాడు).
ఇన్‌స్పెక్టర్: చెప్పండి.
(అందరూ ఆత్రతతో రంగారావునే చూస్తుంటారు).
రంగారావు: తన దారినుండి తప్పించవలసిన అవసరం ఒకే ఒక వ్యక్తికి ఉంది. ఆ వ్యక్తి ఎవరో పద్మకు బాగా తెలుసు. (పద్మ వైపు కసిగా చూస్తూ)
పద్మ: (కంగారు పడుతూ) నా కర్థం కావటం లేదు మీ రనేదేమిటో?
రంగారావు: పద్మా! ఎంతకాలం దాచగలవు నిజాన్ని? ఎప్పటికయినా బయట పడక తప్పదు.
పద్మ: (తెల్లబోతూ చూసింది రంగారావుని).
రంగారావు: ఇంకెందుకు, ఇన్‌స్పెక్టర్‌గారూ! రాజాని వెంటనే అరెస్టు చేయండి... నిజం బయట పడుతుంది.

ఇన్‌స్పెక్టర్: రాజా ఎవరు?
చలపతి: రాజశేఖరం. ఇంకో ఆర్టిస్టు కదయ్యా.
రంగారావు: అంతకన్నా ముఖ్యమైంది—పద్మను ప్రేమించాడు. ఆనంద్ రాకపోతే, పద్మ రాజాను పెళ్ళాడేదని నా నమ్మకం. పద్మను తనకు దక్కనివ్వడన్న భయంతో,ఈర్ష్యతో ఆనంద్‌ని చంపాడు రాజా.
ఇన్‌స్పెక్టర్: మీ అనుమానానికి ఆధారం?
రంగారావు: నిన్న డ్రెస్ రిహార్సల్ అయి, అంతా వెళ్ళిపోయే సమయంలో పక్క క్యూబికల్ లోంచి వినపడ్డ మాటలు.
పద్మ: (కోపంగా) పొంచి వినడం కూడా తెలుసన్న మాట మీకు?
రంగారావు: నేనేం పొంచి వినలేదు. ఆవేశంలో మీరు అరిచిన అరుపులు నా చెవిలో పడ్డాయి. అది నా తప్పు కాదు.
ఇన్‌స్పెక్టర్: ఇంతకీ ఏం విన్నారు?
రంగారావు: "ఆనంద్‌తో తన పెళ్ళి నిశ్చయమైందని, తనని వర్రీ చేయవ"ద్దని పద్మ రాజాతో చెప్పింది. దాంతో రాజాకు ఒళ్ళు మండి కోపంతో "అసలు ఆనంద్ బతికుంటే కదా నిన్ను పెళ్ళాడేది? వాడి అంతు చూస్తాను" అని విసురుగా వెళ్ళిపోయాడు రాజా.
(ఒక్కసారిగా మళ్ళీ నిశ్శబ్దంతో నిండిపోయింది రంగస్థలం).
ఇన్‌స్పెక్టర్: (క్షణం తరవాత మెల్లగా) పద్మగారూ! రంగారావుగారు చెప్పిందంతా...?
(నిజమేనా అన్నట్లు చూశాడు).
పద్మ: (మాట్లాడలేదు ఓ క్షణం. తరవాత మెల్లగా) ఏదో క్షణికోద్రేకంలో అన్న మాట లవి.
ఇన్‌స్పెక్టర్: అసలు రాజాతో ఎప్పటినుండి మీ పరిచయం?
పద్మ: నే నీ సమాజంలో నాటకాలు వేయడం మొదలు పెట్టినప్పటి నుంచీ! బహుశః రెండేళ్ళవుతుందేమో!


గృహిణుల ఆదరాభిమానాలు అందుకొన్న
శాంత టిల్టింగ్ వెట్‌గ్రైండర్

santha

దృఢమైన మోటారుతో పని చేస్తుంది.
నిశ్శబ్దమైన చలనం, 11-12 నిమిషాలలో పిండి తయారీ, శుభ్రపరచడం ఎంతో తేలిక,
ఆకర్షణీయమైన రంగులలో 1 లీటరు, 1½ లీటరు, 2 లీటర్ల సైజులలో
అన్ని పట్టణములందు లభించును.
SUVARNA/PUSHPA
కంపెనీ బ్రాంచి ఆఫీస్:
SANTHA INDUSTRIALS
2-146/3 PATAMATA
OPP. DURGAMAHAL VIJAYAWADA-6
OUR SERVICE IS PROMPT. DO NOT INSURE IT



ముస్తాబులో మార్పు!


సరిక్రొత్త
ఆకర్షణీయమైన సీసాలలో
లోధ్ర
బాధారహిత
ఆరోగ్యమును స్త్రీలకు
80 సంవత్సరములుగా
ఇచ్చుచున్నది.
ఉచిత వైద్య సలహాకు ఈ
కూపనును పూర్తిచేసి
పంపండి.
పేరు: ..........
చిరునామా: ..........
..........PIN..........
ఏజంట్లు:
శీతారామ జనరల్
స్టోర్స్ ఏజన్సీస్
విజయవాడ — సికిందరాబాద్
కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14

ఇన్‌స్పెక్టర్: (కాస్త వెటకారంగానే) మరి, ఆనంద్‌తో మీ ప్రేమాయణం?
పద్మ: (కోపంతో) అది నా స్వవిషయం.
ఇన్‌స్పెక్టర్: (వస్తున్న కోపాన్ని అదుపులో పెట్టుకుంటూ) చూడండి, పద్మగారూ! అది మీ స్వవిషయమైనా, ప్రస్తుత పరిస్థితిలో తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది... ఎప్పుడైతే హతుడు మీ అప్తుడని తెలిసిందో మరు క్షణమే మీ వ్యక్తిగత విషయాలు మీవి కాకుండా పోతాయి. మరో సంగతి మరిచిపోకండి. ఈ విషయం రేపు కోర్టులో బోనెక్కి ప్రమాణం చేసి చెప్పవలసి ఉంటుంది మీరు.
ఇంకోమాట. అఫ్‌కోర్స్, చిన్న సలహా. మీరు ఆనంద్‌ని నిజంగా ప్రేమించి ఉన్నట్లయితే ప్రతి సంగతి— అతి చిన్న విషయమైనా సరే— నాతో తప్పక చెప్పండి. అప్పుడే ఆనంద్‌ని హతమార్చిన హంతకుణ్ణి పట్టుకోడం నాకు సాధ్యమౌతుంది. మీ ప్రియుడి ఆత్మకు శాంతి లభిస్తుంది.
పద్మ: (ముఖంలో ఏదో మార్పు... కాస్త ప్రశాంతత).
ఇన్‌స్పెక్టర్: ఇప్పుడు చెప్పండి... ఆనంద్ ఎప్పటినుంచి తెలుసు మీకు?
పద్మ: గత ఏడాదిగా!
ఇన్‌స్పెక్టర్: అంటే, ఏడాదిగా మీరు రాజాకి దూరంగా ఉంటూ వచ్చారనుకోవచ్చా?
పద్మ: ఒకప్పుడు దగ్గరైతే కదా, ఏడాదిగా రాజాకు దూరంగా ఉండడానికి? ఇన్‌స్పెక్టర్‌గారూ! నా నుంచి ఏదో రాబట్టాలని చూస్తున్నారు. అందుకే నా గురించి కొంత చెప్పడం అవసరం.
మన సమాజంలో నాటకాలాడే వాళ్ళ కుండే స్థానం మీకు తెలియంది కాదు. ముఖ్యంగా నటీమణులంటే ఎంత చిన్న చూపో, ఏవ్యాభావమో నే వేరే చెప్పనక్కరలేదు. ఆఖరికి సంసార స్త్రీలుకూడా నటనను వృత్తిగా స్వీకరిస్తున్న ఈనాడుకూడా నటి అనగానే ఏదో తక్కువ చూపు, ఏదో విధంగా ఆమెను కించపరచాలనే తపన మన సంఘంలో క్రూరుడు కట్టుకు పోయింది—ఒక పక్క ప్రేక్షకులలోనే కాదు, తోటి నటీనటుల్లోకూడా.
స్త్రీ సహజమైన సిగ్గుతో కాస్త ముభావంగా, బెరుకుగా ఉంటూ, తన పాత్రేదో, తన పనేదో చూసుకుని పోతుంటే— అమ్మో! దానికి గర్వంరా, ఎంత టెంపర్రా అంటారు. పోనీ కాస్తంత కలుపుగోలుగా ఉంటూ, సహ నటులతో కలిసి మెలిసి ఉంటే లేనిపోని చనువు తీసుకోడానికి ప్రయత్నిస్తారు. అబ్బే! అదీ చాలా పెద్ద హొంటురా అంటారు.
ఇక నా సంగతి—నేను ఎందుకు, ఏ పరిస్థితుల్లో ఈ వృత్తి చేపట్టాల్సి వచ్చిందో చెప్పాలంటే, అది మరో 'ఆగిపోని నాటకం' అవుతుంది. స్వతహాగా నాకు ప్రతిదీ ఓ పద్ధతి ప్రకారం చేసుకుపోవడం అలవాటు. నాటకం ఒప్పుకున్నాక, ఆ నాటక సమాజం పెట్టుకున్నన్ని రిహార్సల్స్‌కు అటెండ్ అవుతాను వీలైనంతవరకూ. పంక్చుయాలిటీ నా ఆరో ప్రాణం. అందుకే జంటనగరాలలో టైముకు రిహార్సల్స్‌కు హాజరయ్యే నటిగా నేనే ముందు ఉంటాను ఈ నాటికీ.
పోతే, రాజా సంగతి. పరిచయం అయినప్పటినుండి చూస్తున్నాను. అవసరమున్నా, లేకపోయినా నా వద్దకు వచ్చి ఏదో మాట్లాడడానికి ప్రయత్నించేవాడు రాజా! రిహార్సల్స్ లేకపోతే, ఏదో మిషతో మాఇంటికి వచ్చేవాడు. సాధారణంగా స్థితిపరులకుండే 'అహం' రాజాలో కొట్టొచ్చినట్టు కనపడేది. తోటినటుల వెకిలి చేష్టలు మా వృత్తిలో మామూలే. అందుకే రాజాని నేనెప్పుడూ సీరియస్‌గా తీసుకోలేదు.
మానవుల్లో దానవుల్నే చూసిన నేను, ఆనంద్‌లో ఓ హృదయమున్న పురుషుణ్ణి చూశాను తొలిసారిగా...నా పాత్రను గూర్చి చెప్పడమే గాక, వాయిస్ కల్చర్, మాడ్యులేషన్, డైలాగ్ డెలివరీ, మూవ్‌మెంట్స్—ఇలా ఎన్నో విషయాలు... నటన గురించి, నాటకకళ గురించి చెప్పేవాడు ఓ బడిపంతుల్లా. ఒక్క నాకే ఏమిటి? (నలుగురివైపు తిరిగి) మీకు మాత్రం?
రంగారావు: అంతేకాదు. నాటకాల గురించి, నటన గురించి మాకు తెలిసింది చాలా తక్కువని, తెలుసుకోవలసింది ఎంతో ఉందన్న సత్యంలోకి త్రోసేశాడు మమ్మల్ని ఆనంద్.
చలపతి: లెస్స బలికితివి కదయ్యా.
పద్మ: నాకు తెలీకుండానే ఆనంద్‌ని ఆరాధించసాగాను. ఆ విషయమే ఎన్నోసార్లు తనతో చెప్పాలని ఉవ్విళ్ళూరేదాన్ని. తీరా అతని కళ్ళలోకి చూసేటప్పటికి నా ధైర్యం సన్నగిల్లేది.
మొన్న మా ఇంటి కొచ్చి మా నాన్నతో "మీ కభ్యంతరం లేకపోతే, కులగోత్రాల పట్టింపులు లేకపోతే, పద్మ కిష్టమైతే పద్మను పెళ్ళి చేసుకుంటాను" అన్నాడట ఆనంద్. అమ్మ నాతో ఆ విషయం చెబుతుంటే, 'ఎంత ఉత్తముడో, ఎంత ఉన్నతుడో' అనుకున్నాను. అందుకే నిన్న డ్రెస్ రిహార్సల్ జరుగుతున్నప్పుడు సైడ్ వింగులో ఆనంద్‌ని ఆట పట్టించాను— "మీరు హీరో వేషానికి మిస్ ఫిట్" అంటూ. (ఏడుపు ఆపుకోలేకపోయింది. చివరకు ఎలాగో దుఃఖం ఆపుకుంటూ అంది)—అందుకు ఆనంద్ ఏమన్నాడో తెలుసా, రంగారావుగారూ? "నాటకం వేరు, జీవితం వేరు" అని ...(ఏడ్చేసింది బిగ్గరగానే).
చలపతి:, రంగారావు: (పద్మని ఊరడించడానికి ప్రయత్నిస్తారు.)
పద్మ: బహుశా నిన్న మామాటల్ని విన్నాడో, లేక నా ఆనందం పసిగట్టాడో తను రెండేళ్ళుగా నన్ను ప్రేమిస్తున్నానని రాజా నిలేశాడు. అప్పుడు చెప్పాను మా విషయం ఉన్నదున్నట్లు... కాని రాజా ఇంతకు తెగిస్తాడనుకోలేదు (ఏడుస్తుంది).



(అంతలోనే తలుపు చప్పుడు. పద్మ తప్ప అందరూ అటువైపు చూశారు. రంగశ్రీ హడావిడిగా ప్రవేశిస్తాడు).
రంగశ్రీ: ఇది నిజమా చలపతీ? నే విన్నది నిజమా?
చలపతి: ...ఏంటి విన్నావు కదయ్యా?
రంగశ్రీ: ...ఆనంద్ పోయాడని!
రంగారావు: ఆనంద్ పోలేదు... హత్య చేయబడ్డాడు.
రంగశ్రీ: ఆఁ!( అంటూ నిశ్చేష్టుడవుతాడు).
చలపతి: దానికే ఆశ్చర్య పోతావేమిటి కదయ్యా!
రంగశ్రీ: ఆశ్చర్యం కాక మరేమిటి? అపరాధ పరిశోధనలతో నాటకాలు వ్రాసి, పాత్రలచేత హత్యలు చేయించాను కాగితంమీద. కాని ఇలా నిజంగానే నాటకం జరుగుతుంటే, ఒక నటుడు హత్య చేయబడటం, 'నాటకం ఆగిపోవటం'—ఇదేం ట్విస్ట్, అయ్యా? నా బొంద ట్విస్ట్?
చలపతి: అదే కదయ్యా గమ్మత్తు! నాటకాల్లోని ట్విస్టులకన్నా జీవితంలోని ట్విస్ట్ విచిత్రంగాను, థ్రిల్లింగ్‌గాను ఉంటుంది కదయ్యా... అసలు తమాషా ఏమిటంటే, ఆనంద్‌ని హత్య చేసింది రాజా అట!
ఇన్‌స్పెక్టర్: చలపతిగారూ! తొందరపడి నిర్ణయాలకి రాకండి.
రంగశ్రీ: సొంతం చెప్పనివ్వండి, స్వామీ!
ఇన్‌స్పెక్టర్: అసలు మీ రెవరు? నాటకంలో మీరు ఓ పాత్రధారులా?
రంగశ్రీ: ఓ విధంగా చెప్పాలనుకుంటే అంతేననుకోండి. కాని నా పాత్ర రంగస్థలం మీది కొచ్చి (ప్రేక్షకులను చూపుతూ) వీళ్ళందరికీ కనపడదు... ఈ భూప్రపంచంలోని పాత్రల నన్నింటినీ సృష్టించి, నడిపించే

పద్మ: నాటకానికి ముందు.
ఇన్‌స్పెక్టర్: అదే-ఎంతముందని?
పద్మ: నా మేకప్, డ్రెస్సింగ్ అయిన తరవాత-అంటే నాటకం ప్రారంభించడానికి ఓ పది, పదిహేను నిమిషాల ముందు.
ఇన్‌స్పెక్టర్: ఎక్కడ కలిపారు? స్టేజీ మీదా?
పద్మ: కాదు. నా డ్రెస్సింగ్ రూములో.
ఇన్‌స్పెక్టర్: అప్పుడు ఎవరున్నారు మీతో?
పద్మ: ఎవరూ లేరు.
ఇన్‌స్పెక్టర్: మరి ఇక్కడి కెలా వచ్చింది? ఎప్పుడు వచ్చింది?
పద్మ: నేనే తెచ్చిపెట్టాను అక్కడ. అప్పుడు ఆరూఇరవై అయ్యుండవచ్చు.
ఇన్‌స్పెక్టర్: అంటే, మీ రీసీసా పెట్టి వెళ్ళిన తరవాత, నాటక ప్రారంభానికి ముందు ఎవరైనా దీంట్లో విషం కలవడానికి అవకాశమున్నదన్న మాటేగా?
చలపతి: ఎటువంటి అవకాశం లేదు కదండయ్యా! ఆ సీసా పద్మ తేడానికి కాస్త ముందే రంగారావు, నేను ఉన్నాం కదయ్యా!
ఇన్‌స్పెక్టర్: అప్పుడేం చేస్తున్నారు మీ రిద్దరూ?
చలపతి: టీపాయ్ మీద మాగజైన్స్ పెట్టి ఇటు తిరిగాను కదయ్యా—పద్మ వెళ్ళిపోతూ కనిపించిందయ్యా. అటు తిరిగి చూద్దును కదయ—రంగారావు డ్రింక్స్ కాబినెట్ దగ్గరగా నిలబడి, ఆ సీసావైపు తీక్ష్ణంగా చూస్తూ ఉన్నాడు కదయ్యా.
ఇన్‌స్పెక్టర్: (రంగారావుని చూస్తూ) డ్రింక్స్ కాబినెట్ దగ్గర మీ రెందుకు నిలబడ్డారు?
రంగారావు: అదికూడా అపరాధమా ఇన్‌స్పెక్టర్‌గారూ? నన్నూ అనుమానిస్తున్నారా?
ఇన్‌స్పెక్టర్: పరిస్థితి అలాంటిది. హంతకుడు పట్టుబడే వరకు ప్రతి ఒక్కరినీ అనుమానించక తప్పదు. నాటక ప్రారంభంలో మీ రా రాకింగ్ ఛైర్‌లో కూర్చొని ఉన్నారు కదా-మరి తెర తీసే ముందు ఈ బాటిల్‌ని చూస్తూ ఇక్కడ ఎందుకు నిలబడ్డారు?
రంగారావు: (వచ్చే కోపాన్ని అణుచుకుంటూ) మీ ప్రశ్నకు సమాధానం ఇచ్చే ముందు మా నాటక సమాజం గురించి కొంత చెప్పడం అవసరం. మా కళాకుంజ్ స్థాపించి ఆరేళ్ళు కావస్తోంది. ఇన్నాళ్ళూ ఏవో కొన్ని నాటికలు వేశాంకాని, అవి అంతంత మాత్రంగానే ఉండేవి. అందుకు ముఖ్య కారణం మా కో సరైన ప్రయోక్త లేకపోవడమే. ఒక ఏడాది చలపతి దర్శకుడుగా ఎన్నికైతే, మరో ఏడు నేనే, మరోడే పోటీ పడేవాళ్ళం. ఎవరికి వాళ్ళం నువ్వు చెప్పే దేమిటి. నీ కేం తెలుసు నన్న భావంతో ఉండేవాళ్ళం.
చలపతి స్నేహితుడు రంగశ్రీ. మా సమాజం రంగశ్రీ నాటకాలే ప్రదర్శించాలి. తప్పదు. అందులో కథానాయిక రంగశ్రీ కూతురు సరోజ కాక తప్పదు. సరోజ హీరోయిన్ అయితే, స్థితిపరుడైన మెంబర్ రాజా హీరో కావడం తథ్యం. ఇదండీ మా సమాజ స్థితి. అటువంటిది ఆనంద్ రాకతో అంతా మారిపోయింది. మా ఆఫీసులోనే పని చేస్తాడు ఆనంద్. ఏడాది క్రితం బదిలీమీద కలకత్తానుండి వచ్చాడు. మాచేత మంచి నాటకా లాడించమని బలవంతం చేసి తీసుకొచ్చాను ఆనంద్‌ని. కొద్ది రోజుల్లోనే ఆనంద్ మా అందరికీ ఆప్తుడయ్యాడు. మే మో మంచి టీమ్‌గా తయారయ్యాం.
మామధ్య ఏ తారతమ్యాలు, అరమరికలు లేకుండా ప్రతి పని, ప్రతి ఒక్కరూ సర్దుకుపోయే ఔదార్యం, సామ్యం మాలో కలిగించాడు ఆనంద్. ఒక్కొక్కరికి ఓ బాధ్యత అప్పగించేవాడు. నా బాధ్యతల్లో ముఖ్యమైనవి-పద్మ విస్కీసీసా, గ్లాసులు డ్రింక్స్ కాబినెట్ మీద పెట్టిందో లేదో చూడటం, టేబిల్‌పై లెటర్‌పాడ్, పెన్నూ, టేబిల్ సొరుగులో రివాల్వర్—అఫ్‌కోర్స్, డమ్మీ రివాల్వర్ ఉందో లేదో చూడటం. ఏం చలపతీ, నే చెబుతున్నది? (నిజమేనా అన్నట్లు చూశాడు).
చలపతి: (బుర్ర ఊపుతాడు అవునన్నట్లు).
రంగారావు: పద్మ వచ్చేసరికి టేబిల్ సర్దడం పూర్తయింది. ఆ తరవాత వచ్చి ఇక్కడ నిలబడి బాటిల్, గ్లాసులు చూశాను.
ఇన్‌స్పెక్టర్: అది సరేకాని, ఆ సీసాలోది తాగి ఆనంద్ పడిపోయే ముందు ఏం చేశాడో చెప్పండి.
రంగారావు: "అటువంటి ఘోరం జరక్కుండా చూడ్డం మన విధి " అన్న మూర్తి డైలాగు శేఖరం ఎంట్రన్స్‌కు క్యూ-కాచ్ డైలాగు. అయినా రాజా ప్రవేశించక పోయేసరికి మాకు ఏం చేయాలో తోచలేదు క్షణంపాటు. మరుక్షణం ఆనంద్ యాక్షన్‌తో ఆ గాప్‌ని కవరు చేయసాగాడు.
ఇన్‌స్పెక్టర్: అన్నట్లు, మీ నాటకం స్క్రిప్టు ఏదీ?
చలపతి: (స్క్రిప్టు పుస్తకం అందిస్తాడు).
ఇన్‌స్పెక్టర్: (నాటకం స్క్రిప్టు పేజీలు తిరగేస్తూ, సాలోచనగా) ఆనంద్ మూర్తి విస్కీ తాగే సన్నివేశం ఎక్కడుందో కాస్త చూపిస్తారా? (స్క్రిప్టు అందివ్వబోతాడు).
రంగారావు: ఆ సన్నివేశం లేదు నాటకంలో. చెప్పానుగా—గాప్ కవరు చేయడానికి. అంటే, శేఖరం పాత్ర ప్రవేశించేవరకు ఆడియన్స్‌ని ఎంగేజ్ చేయడానికి ఆనంద్ అప్పటి కప్పుడు ఇంప్రొవైజ్ చేస్తూ తాగాడనుకుంటా.
ఇన్‌స్పెక్టర్: అసలు నాటకంలో మూర్తి పాత్ర ఎప్పుడు తాగుతుంది?
రంగశ్రీ: మూర్తి పాత్ర తాగే ప్రసక్తే లేదు నాటకంలో.
ఇన్‌స్పెక్టర్: (ఆశ్చర్యంతో తెల్లబోయాడు).
రంగశ్రీ: అవును, ఇన్‌స్పెక్టర్‌గారూ! నాటకం మొత్తంలో మూర్తి పాత్ర అసలు తాగదు.
ఇన్‌స్పెక్టర్: (మెల్లమెల్లగా ఆశ్చర్యంలోంచి తేరుకుంటూ) అంటే, రాజశేఖరం ప్రవేశం ఆలస్యం కాకపోతే, ఆనంద్ ఆ సీసాలోది తాగేవాడు కాదన్న మాట! అంటే, ఆ సీసాలో విషం కలిపిన వాళ్ళ ఉద్దేశం ఆనంద్‌ని చంపడం కాదన్న మాట! (నాటకం స్క్రిప్టు సోఫాలో పడేస్తూ) అంటే, హంతకుడు ఎవర్నో చంపాలని ప్లాను వేస్తే, మరెవరో దానికి ఆహుతి అయ్యా రన్న మాట... (అంటూ నలుగుర్నీ తీక్ష్ణంగా చూసి) మీరు చెప్పండి, పద్మగారూ! (కొంచెం కర్కశంగానే) మొట్టమొదట విస్కీ తాగే యాక్షన్ నాటకంలో ఎవరికుంది?
రాజా: నే చెప్తా, ఇన్‌స్పెక్టర్... నాటకంలో విస్కీ తాగేది నేనే.
ఇన్‌స్పెక్టర్: (మరోమారు ఆశ్చర్యపోయాడు). నిజమేనా, కవిగారూ?
రంగశ్రీ: నిజమేనండీ. శేఖరం పాత్ర ప్రవేశించిన కొద్ది సేపట్లోనే విస్కీ తాగుతుంది.


నూతన యవ్వనం పొందండి
సంతానవంతులు కండి. చర్మవ్యాధుల
నుండి విముక్తులు కండి.



హస్త ప్రయోగము వలన కలుగు
నరముల బలహీనత, శీఘ్రస్ఖలనము
అంగము చిన్నదగుట, అవసర
కాలమందు అసంతృప్తి.
సంతానము లేక పోవుట, సమస్త
చర్మవ్యాధులకు అద్భుత చికిత్స
పోస్టు ద్వారా చికిత్స కలదు.

క్యాంపులు: ప్రతి ఆదివారం భీమవరం. షణ్ముఖ లాడ్జి నందు ఉ॥ 9 గం॥ నుండి సా॥ 6-30 గం॥ వరకు ప్రతినెల 1. మరియు 16. తేదీలలో "రాజమండ్రి" హోటల్ అప్సర లో మధ్యాహ్నం 12 గం॥ నుండి రాత్రి 9 గం॥ వరకు

డా॥ డి. మార్కండేయులు
ఆయుర్వేద భిషక్, సెక్స్ అండ్ స్కిన్ స్పెషలిస్ట్,
పార్కు రోడ్, గుడివాడ-521 301
ఫోన్స్ 522 అండ్ 540

ఇన్‌స్పెక్టర్: (భుజాలు షేక్‌చేస్తూ) వెల్, మిస్టర్ రాజశేఖరం! మీరు చాలా అదృష్టవంతులు. మీ లేట్ ఎంట్రన్స్ మీ ప్రాణాన్ని కాపాడి, మరొకళ్ళను పొట్టన పెట్టుకుంది.

చలపతి: ఇదంతా చూస్తుంటే, ఎప్పుడు నాటకం వేసినా, స్టేజీమీదకు కాస్త ఆలస్యంగానే ప్రవేశిస్తేనే బాగుంటుంది కదయ్యా!

రాజా: థాంక్యూ, ఇన్‌స్పెక్టర్! మీ ఇన్వెస్టిగేషన్‌తో నన్ను సేవ్ చేశారు. (జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి, ఓ సిగరెట్ వెలిగించాడు.)

ఇన్‌స్పెక్టర్: నా పరిశోధన ఇంకా పూర్తికాలేదు, రాజశేఖరంగారూ. అసలు హంతకుడు ఇంకా పట్టుబడలేదు.

రాజా: (మెల్లగా డ్రింక్స్ కాబినెట్ వైపు వెళ్ళి సిగరెట్ పొగ వదులుతూ విస్కీ బాటిల్‌ని తీక్షణంగా చూస్తుంటాడు).

ఇన్‌స్పెక్టర్: ఇప్పుడు మనం తెలుసుకోవలసిన ముఖ్య విషయం-మిమ్మల్ని చంపవలసిన అగత్యం ఎవరికో ఉందన్న మాట. అది ఎవరికుంది? ఎవరది? మిమ్మల్ని ఎందుకు చంపాలి? (అందరివైపు అనుమానంగా చూస్తూ, మెల్లగా రాజా దగ్గర కెళ్ళాడు). మీ కెవరి మీదైనా అనుమానంగా ఉందా?

రాజా: (ఒక్కసారిగా పద్మని చూశాడు. మెల్లగా తన చూపుల్ని రంగారావు, చలపతి, రంగశ్రీలవైపు మళ్ళించాడు. చివరకు లేదన్నట్లు తలూపాడు అడ్డంగా).

ఇన్‌స్పెక్టర్: (క్షణం ఇరకాటంలో పడ్డాడు. మరుక్షణం తేరుకొని) మీ రెవ్వరూ నాతో సహకరించటం లేదు...ఒక హత్య కేసుకు సంబంధించిన విషయాలు తెలిసికూడా దాచడం చట్టరీత్యా నేరం. ప్లీజ్ కమ్ అవుట్ విత్ వాట్ యు నో.

(ఎవ్వరూ మాట్లాడలేదు)

ఇన్‌స్పెక్టర్: ఆల్‌రైట్! ఇంతవరకూ జరిపిన పరిశోధన ఒకే ఒక వ్యక్తిని నేరస్థురాలిగా నిలబెడుతుంది. ఈ సీసాలో విషం ఆమె కలపలేదనడానికి ఆమె మాటలు తప్ప వేరే సాక్ష్యం లేదు.

పద్మ: (అప్రతిభురాలైంది క్షణం. అంతలోనే తేరుకొని దీనంగా) ప్రమాణం చేసి చెప్తున్నాను, ఇన్‌స్పెక్టర్‌గారూ! నేను దాంట్లో విషం కలపలేదు.

ఇన్‌స్పెక్టర్: మరి ఎవరు కలిపారు?

పద్మ: నే చూళ్ళేదు. నాకు తెలీదు... నా మాట నమ్మండి- ప్లీజ్!

ఇన్‌స్పెక్టర్: (సూటిగా పద్మ కళ్ళలోకి చూస్తూ) అమాయకత్వం వెదజల్లే మీ కళ్ళను చూస్తుంటే, మీ మాటలు నమ్మాలనే ఉంది. కాని న్యాయస్థానం? అది నమ్మదు. (ఆమెకు రెండడుగులు దూరంగా వేసి) పైగా మీరే చెప్పారు- గ్రీన్ రూమ్‌లో ఆ పదార్థం తయారు చేసినప్పుడు మీ ప్రక్కన ఎవరూ లేరని. ఆ సీసా తెచ్చి డ్రింక్స్ కాబినెట్‌పై పెట్టినప్పటినుంచి ఇక్కడే ఉన్నారు-రంగారావు, చలపతి. వీళ్ళిద్దరికీ ఒకళ్ళకు తెలియకుండా మరొకరు ఆ సీసాలో విషం కలపడం అసాధ్యం. పోతే, తెర ఎత్తిన తర్వాత ఈ ప్రేక్షకులకు తెలీకుండా ఆ సీసాలో ఎవ్వరూ ఏం కలపలేదు. ప్రేక్షకుల తరపున నే హామీ ఇవ్వగలను ఆ విషయంలో. ఎందుకంటే, హత్య జరిగేంతవరకు ప్రేక్షకుల్లో నేనూ ఒకణ్ణి కనక.

అందుకే పద్మకు తప్ప మరెవరికీ ఆ సీసాలో విషం కలిపే అవకాశం లేదు. (ఒక్కసారిగా కఠినంగా మారాడు). ఇంక తప్పించుకోవడం నీ తరం కాదు, పద్మా! ఆ సీసాలో విషం కలిపింది నువ్వు... రాజాని చంపాలనుకున్నది నువ్వు. ఆనంద్‌ని చంపింది నువ్వు. ముమ్మాటికీ నువ్వే హంతకురాలివి.

పద్మ: (పిచ్చిగా) కాదు-కాదు-కాదు... (పెద్దగా ఏడుస్తుంది.)

(పద్మ దుఃఖానికి అందరి హృదయాలు కరిగిపోయాయి.)

రంగశ్రీ: ఇన్‌స్పెక్టరుగారూ! ఇది అన్యాయం. పద్మను ఇలా బాధపెట్టడం బావులేదు...విషం కలిపే అవకాశం ఒక్క పద్మకే ఉంది గనక, ఆమె హంతకి అంటే సరిపోదు. అసలు హత్యకు మోటివ్ ఏమిటి? రాజాను చంపవలసిన అవసరం పద్మ కేముంది?

ఇన్‌స్పెక్టర్: ఆనంద్‌ని ప్రేమించింది గనుక.

రంగశ్రీ: ప్రేమించిన ప్రతి స్త్రీ హత్య చేస్తుం దనడం హాస్యాస్పదం. అయినా ఆనంద్‌ని ప్రేమిస్తే, రాజాను హత్య చేయాలని ఎందు కనుకుంటుంది?

ఇన్‌స్పెక్టర్: ప్రేమించిన ప్రతి స్త్రీ హత్య చేస్తుందని నేను అనలేదే!...ప్రాణాధికమైన ప్రేమలో చిక్కుకున్నప్పుడు, మరో వ్యక్తి అసూయతో అడ్డు నిలిస్తే, అతణ్ణి తొలగించుకోవడం సహజం. ఈ నాటకం వల్ల తనకు లభించిన అవకాశాన్ని సద్వినియోగ పర్చుకుంది పద్మ. అంతే!

పద్మ: (మరింతగా ఏడుస్తూ) నే నే పాపమూ ఎరుగను. ఎవర్నీ చంపాలనుకోలేదు. నే నే విషం కలపలేదు. నన్ను నమ్మండి. ప్లీజ్- నా మాట నమ్మండి.

ఇన్‌స్పెక్టర్: (రంగశ్రీని సూటిగా చూస్తూ) మీరేమీ అనుకోనంటే ఒక విషయం అడుగుతాను. మీ అమ్మాయి సరోజకి, రాజశేఖరంగారికి పరిచయం ఉందని విన్నాను. అది ఎంతవరకు నిజం, కవిగారూ?

రంగశ్రీ: (ఖంగుతిన్నాడు. అంతలోనే తేరుకొని) నటీనటులన్న తర్వాత ఒకరితో మరొకరికి పరిచయం ఉంటుంది. ఉండడం అవసరంగూడా. దీంట్లో నిజా నిజాల ప్రసక్తే ముంటుంది?

ఇన్‌స్పెక్టర్: (రాజా దగ్గర కెళ్ళి) పోనీ,మీరు చెప్పండి, రాజశేఖరంగారూ!

రాజా: (మొగమాటపడుతూ) అవన్నీ ఇప్పుడెందుకండీ?

ఇన్‌స్పెక్టర్: అవసరం గనకే అడిగాను.

రాజా: (రెండడుగులు స్టేజి ముందు కేసి, ఎటో చూస్తూ) నన్ను ప్రేమించానంది సరోజ...పెళ్ళి చేసుకోమని వేధించుకు తినేది.

రంగశ్రీ: (ఉద్రేకం ఒక్కసారిగా కట్టలు త్రెంచుకుంది). అబద్ధం...శుద్ధ అబద్ధం...

చలపతి: రంగా! (రంగశ్రీ దగ్గరగా వెళ్ళి ఉద్రేకపడవద్దని ఊరడిస్తాడు)...

రంగశ్రీ: (కాస్తంత చల్లబడ్డాడు.)

ఇన్‌స్పెక్టర్: ఉద్రేకపడకండి, కవిగారూ! మీ మధ్య ఉండే భేదాలు, కలతలు వెళ్ళబెట్టుకొనే సమయం కాదిది. ముందు ఆనంద్‌ని చంపిన హంతకుణ్ణి అరెస్టు చేయాలి. అది ముఖ్యం...(పద్మవద్ద కెళ్ళి) సారీ, పద్మగారూ! ఐ యామ్ రియల్లీ వెరీ సారీ. మిమ్మల్ని అరెస్టు చేయక తప్పదు.

పద్మ: రాజా! (అంటూ పెద్దగా ఏడ్చింది.)

రాజా: పద్మా! (అంటూ దగ్గరగా వెళ్ళాడు). ఊరుకో, పద్మా, ఊరుకో.

పద్మ: (ఇంకా ఏడుస్తూనే) ఇదంతా నీ వల్లే వచ్చింది. కోపంతో ఒళ్ళు తెలియకుండా పేలింది నువ్వు. అన్యాయంగా అరెస్టు చేస్తున్నది నన్ను. ఇప్పటికయినా నీ మనస్సు చల్లబడిందా?

(పద్మ మాటలకు చలించిపోయారు రంగారావు, చలపతి, రంగశ్రీ శిలాప్రతిమలా నిలబడ్డారు.)

రాజా: ఊరుకో, పద్మా, ఊరుకో...నువ్విలా బెంబేలుపడితే లాభంలేదు...బాగా ఆలోచించు...మరొక్కసారి గుర్తు చేసుకో, పద్మా! నువ్వు పర్మాంగనేట్ కలిపి స్టేజిమీద కొచ్చే లోపల నీ డ్రెస్సింగ్ రూమ్‌లోకి ఎవరొచ్చి వెళ్ళారో సరిగ్గా గుర్తు చేసుకో.

పద్మ: (తెల్లబోయి చూస్తుంటుంది.)

రాజా: ఆలోచించు, పద్మా...బాగా ఆలోచించు.

పద్మ: (లేదన్నట్లే తలూపుతుంది.)

రాజా: పోనీ, నేను మేకప్‌లో ఉండగా, నువ్వు నన్ను పలకరించడం గుర్తుందా?

పద్మ: ఆఁ...గుర్తొస్తూంది, రాజా! ట్రేలో విస్కీ సీసా, గ్లాసులు ఉంచి స్టేజిమీదకు వెళుతుంటే, నువ్వు మేకప్ చేయించుకుంటూ కనబడ్డావు. అప్పుడు-

రాజా: నన్ను కేక వేశావు—"తెర తీయడానికి పది నిముషాలు కూడా లేదు. ఇంకా నువ్వు మేకప్‌లో ఉన్నావా!" అని.

పద్మ: అప్పుడే నువ్వు నన్నడిగావు- "రంగశ్రీ ఏమంటున్నా?" డని...ఆఁ... ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది...

ఇన్‌స్పెక్టర్: (వెంటనే పద్మ వద్దకు వస్తూ) ఇప్పుడు చెప్పండి- ఎక్కడ కలిశారు కవిగారు మిమ్మల్ని?

పద్మ: నా డ్రెస్సింగ్ రూమ్‌లో.

ఇన్‌స్పెక్టర్: ఎప్పుడొచ్చారు? ఎందుకొచ్చారు?

పద్మ: ఆ సీసాలో పర్మాంగనేట్ కలిపి, వాష్ బేసిన్‌కు వెళ్ళి వచ్చేసరికి బాబాయి నా గదిలో ఉన్నారు.

ఇన్‌స్పెక్టర్: బాబాయి ఎవరు?

పద్మ: రంగశ్రీగారిని బాబాయని పిలుస్తాను.

ఇన్‌స్పెక్టర్: ఎంత సేపు వెళ్ళారు మీరు గది విడిచి?

పద్మ: ఎంతో సేపు కాదు. మహా అయితే రెండు, మూడు నిముషాలు.

ఇన్‌స్పెక్టర్: తిరిగి మీరు గది కొచ్చేటప్పటికి రంగశ్రీగారు ఏం చేస్తూ కనపడ్డారు?

పద్మ: బయటకు వచ్చేయబోతున్నారు.

ఇన్ స్పెక్టర్: మీరు లేనప్పుడు మీ గదిలో ఏం చేస్తున్నారని అడగలేదా మీరు?

పద్మ: ఎలా అడుగుతా నండీ బాబాయిని? గ్రీన్ రూములో ఒకళ్ళ గదిలోకి మరొకళ్ళు వెళ్ళడం కొత్తకాదుగా.

ఇన్ స్పెక్టర్: సరే, రంగశ్రీగారిని చూశాక, ఎందుకొచ్చారని అడగలేదా మీరు?

పద్మ: నన్ను చూస్తూనే బాబాయి "ఏంటమ్మా! ఇంకా ఇక్కడే ఉన్నావు? కర్టెన్ తీసే టైమయింది- పద పద" అంటూ వెళ్ళిపోయారు.

(పై సంభాషణ జరుగుతుంటే, మెల్లమెల్లగా రెండడుగులు వెనక్కువేసి జారుకోబోతాడు రంగశ్రీ).

ఇన్ స్పెక్టర్: తప్పించుకోవడం అంత సులువు కాదు, కవిగారూ! (అంటూ ఇంటి ద్వారం దగ్గరే రంగశ్రీని అటకాయిస్తాడు).

(చెయ్యి పట్టుకుని స్టేజి మధ్యకు ఈడ్చుకొచ్చాడు. ఏ విధమైన ఫీలింగ్స్ లేకుండా, శూన్యంలోకి చూస్తూ స్థాణువులా నిలబడ్డాడు రంగశ్రీ. మిగిలిన అందరూ ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోలేదు.)

ఇన్ స్పెక్టర్: ఇప్పటికైనా నిజం ఒప్పుకోవడం మంచిది, రంగశ్రీగారూ.

రంగశ్రీ: (మాట్లాడడు).

ఇన్ స్పెక్టర్: నిజం ఒప్పుకోవడం వల్ల, శిక్ష తగ్గే అవకాశముంటుందని మరిచిపోకండి, రంగశ్రీగారూ!

రంగశ్రీ: (మాట్లాడడు).

ఇన్ స్పెక్టర్: ఇంకా మీరిలా బిగుసుకునే ఉంటే, మీమీద థర్డ్ డిగ్రీ ఉపయోగించవలసి ఉంటుంది. అది మేం సాధారణంగా ప్రొఫెషనల్ క్రిమినల్స్ విషయంలో చేస్తాం. మీ లాంటి చదువూ, సంస్కారమున్న వాళ్ళపై కాదు. కమాన్... కమ్ అవుట్ విత్ ది ట్రూత్.

(అందరూ ఆత్రతతో చూస్తుంటారు రంగశ్రీని).

రంగశ్రీ: (ఏదో దృఢ నిశ్చయానికి వచ్చి) యస్, ఇన్ స్పెక్టర్! సీసాలో విషం కలిపింది నేనే. పద్మ అమాయకురాలు. ఆమెకేం తెలియదు.

పద్మ: (ఏడుస్తూ) బాబాయ్! (రంగశ్రీ దగ్గరగా వెళ్ళి) నన్ను రక్షించడానికి నేరం నీ మీద వేసుకుంటున్నావా, బాబాయ్? వద్దు, బాబాయ్, వద్దు. బాబాయ్ మాటలు నమ్మకండి, ఇన్ స్పెక్టర్‌గారూ. ఈ విషయంలో ఆయనకేం తెలీదు.

రంగశ్రీ: (ఒక్కసారిగా చలించిపోయాడు). అమ్మా, పద్మా! నీకు తెలీదమ్మా నేనెంత పాపిష్ఠివాణ్ణో! నీ మంచితనంతో నన్నింకా చిత్రవధ చేయకమ్మా. ఇన్ స్పెక్టర్‌గారూ! ఆడపిల్లల జీవితాలతో ఆటలాడుకునే ఓ మోసగాణ్ణి మట్టు పెట్టాలని నేనే కలిపాను విషం. పద్మ గ్లాసు పట్టుకుని వాషింగ్ బేసిన్ వేపు వెళ్ళగానే ఆ గదిలోకి దూరాను. సీసాలో విషం కలిపి ఇటు తిరిగేటప్పటికి పద్మ తిరిగి వచ్చింది. ఆమెను పలకరించి వెళ్ళిపోయాను.

చలపతి: రంగా! ఎందుకు చేశావు కదయ్యా ఈ పని? అసలు రాజాని ఎందుకు చంపాలనుకున్నావు కదయ్యా?

రంగశ్రీ: చలపతీ! ఆప్తమిత్రుడివైనా, నీతోకూడా చెప్పలేదు ఇన్నాళ్ళూ. నీకు తెలుసుగా తల్లి లేని పిల్ల సరోజ ఎంత అమాయకురాలో, అదంటే నాకెంత అభిమానమో! సరోజ అమాయకత్వాన్ని అలుసుగా తీసుకున్నాడు ఈ రాజా. ఆమెను తన వల్లో వేసుకున్నాడు. దాని జీవితం మంటగలిపాడు. కొన్నాళ్ళ క్రితం సరోజ నలతగా ఉంటే కంగారు పడ్డాను. ఆఖరికి నిజం తెలిసింది. సరోజకు నెల తప్పింది. అది తెలిసి రాజా సరోజకు దూరంగా ఉంటున్నాడట.

వెంటనే రాజాను కలుసుకున్నాను. సరోజ బ్రతుకు నాశనం చేయవద్దని, కనీసం ఆమె గర్భంలో పెరుగుతున్న శిశువు గురించైనా ఆమెను వివాహ మాడమని అర్థించాను. దానికి ఆ దుర్మార్గుడు అనరాని మాటలన్నాడు. ఆఖరికి నా సరోజ శీలాన్నే శంకించాడు.

అప్పుడే అనుకున్నాను— వాణ్ణి సర్వనాశనం చేయాలని. ఆ నాటి నుండి అవకాశంకోసం ఎదురు చూడసాగాను. గుర్తుందా, చలపతీ! ఒకనాడు నాటకంలో విస్కీ ప్రసక్తి వచ్చినప్పుడు తనకు రియల్ విస్కీనే పెట్టాలని రాజా గొడవ చేయడం, ఆనంద్ వీల్లేదనడం... అది విన్న నన్ను ఏదో భూతం ఆవహించింది. రియల్ విస్కీ కాదురా, రియల్ విషమే అనుకున్నాను మనసులో. 'నాటకం ఆగిపోయింది' అని నే రాసిన నాటకంలో రాయని పాత్రగా నటించడానికి తహతహ లాడాను. నిన్న గ్రీన్‌రూమ్‌లో రాజా మాటలు విన్న నాకు మరింత ధైర్యం వచ్చింది. నన్నెవరూ పట్టుకో లే రనుకున్నా.

కాని దైవ నిర్ణయం మరోలా ఉంది. కన్నకొడుకు లాంటి ఆనంద్ నా అమానుషత్వానికి బలైపోయాడు. (రెండు చేతులలోనూ ముఖం మూసుకుని రోదించాడు).



చలపతి: రంగా! ఎంత పని చేశావుకదయ్యా? ఎంత పని జరిగిపోయింది కదయ్యా? (అంటూ ఏడుస్తాడు).

పద్మ: బా...బా...య్! (దుఃఖం ఆపుకోలేకపోయింది.)

ఇన్ స్పెక్టర్: సారీ, మిస్టర్ రంగశ్రీ! ది క్రైమ్ ఈజ్ అప్... (అంటూ ఇంటి ద్వారం వైపు అడుగు వేస్తాడు).

(ఇంటి ద్వారం వైపు రంగశ్రీ భారంగా అడుగులు వేస్తుంటాడు. చలపతి, పద్మ ఏడుస్తుంటారు. రంగారావు చేష్టలుడిగినవాడై చూస్తుంటాడు. రాజా శూన్య దృక్కులతో నిలబడి ఉంటాడు.)

ఇన్ స్పెక్టర్: (రంగశ్రీని బయటకు పంపుతూ) మిస్టర్ రెడ్డీ! టేక్ దిస్ మాన్ ఇన్‌టు కస్టడీ. (రంగశ్రీ వెళ్ళగానే తలుపు మూసి, స్టేజి మధ్య కొస్తాడు).

రంగారావు: ఇన్ స్పెక్టర్‌గారూ! ఒక్క మాట. అసలు రంగశ్రీని ఎలా అనుమానించారు?

ఇన్ స్పెక్టర్: (చిరునవ్వుతో) నిజం చెప్పమన్నారా? హంతకుణ్ణి పట్టుకోడానికి నాకు సరైన క్లూ ఇచ్చింది (ప్రేక్షకులను చూపుతూ) ఈ ప్రేక్షకులు!

(అందరూ ఆశ్చర్యంగా చూశారు).

ఇన్ స్పెక్టర్: నాటకానికి నేను ఓ ప్రేక్షకుడిగా రాకపోతే, ఇంత సులువుగా హంతకుడు దొరికేవాడు కాదేమో!

మన ప్రేక్షకమహాశయులకు మామూ లేగా నాటకం మొదలయిందగ్గర నుంచి రన్నింగ్ కామెంట్రీ ఇవ్వడం. "సరోజ లేదేంట్రా ఈ నాటకంలో" అని ఒకరంటే, "ప్రతి నాటకంలో సరోజ ఎందుకుండాలి?" అని మరొకరు, "రచయిత కూతురు నాటకంలో లేకపోతే ఎలా, గురూ" అని ఇంకొకరు అనుకోవడం విన్నాను. పద్మ మాటలవల్ల రాజశేఖరంగారికి కాస్త ఆడవాళ్ళంటే వీక్నెస్ అని గ్రహించాను. అప్పటినుంచి రంగశ్రీని ఎలా కార్నర్ చేయడమాఅని ఆలోచిస్తున్నాను. మరో దారి లేక, పద్మని బాధించడం మొదలుపెట్టాను. ఒక అమాయకురాలిపై అన్యాయంగా నేరం మోపబడుతుంటే—కవి కదా, ఆ మాత్రం మనస్సు కరగదా అనుకున్నాను. కానీ రంగశ్రీ చలించలేదు.

సమయానికి రాజశేఖరంగారు సాయం చేశారు. మరచిపోయిన సంగతి గుర్తు తెచ్చుకోడానికి పద్మకు తోడ్పడ్డారు. థాంక్స్ ఎ లాట్, మిస్టర్ రాజశేఖరం! (జేబురుమాలుతో జాగర్తగా విస్కీ సీసా పట్టుకుంటూ) కాని ఒక్కమాట, రాజశేఖరంగారూ! అఫ్‌కోర్స్, ఎ పీస్ ఆఫ్ అడ్వయిజ్. ఇకనైనా ఆడవాళ్ళ జీవితాలతో చెలగాటాలు ఆడడం మానండి. (అందర్నీ చూస్తూ) ఓకే... ఎవ్రీబడీ. (వేగంగా అడుగులు వేసి, ద్వారం దగ్గర ఆగి, వెనుదిరిగి నవ్వుతూ) చలపతిగారూ! ఈ 'నాటకం ఆగిపోయింది' నాటకం ఆగకుండా మళ్ళీ ఎప్పుడైనా వేస్తే, నన్ను తప్పక పిలుస్తారు కదండయ్యా!

(అందరూ నవ్వుతారు).

చలపతి: మళ్ళీ ఈ జన్మలో నాటకమే! (లెంపలు వేసుకుంటూ) బుద్ధొచ్చింది కదయ్యా!

(నవ్వుతూ నిష్క్రమిస్తాడు ఇన్ స్పెక్టర్. అందరూ నవ్వుతుండగా అవనిక మెల్లగా జారుతుంది).

(సమాప్తం)